ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 17 జనవరి 2024



• లాడ్జి రూమ్ రూ.15 వేలు !

నరసాపురం, జనవరి 16 : కోడి పందేల పేరుతో జిల్లాలోని లాడ్జీల గదుల ధరలు చుక్కలనంటాయి. సంక్రాంతి మూడు రోజులు ఎక్కడా రూము దొరకని పరిస్థితి. కోడి పందేలను చూసేందుకు, ఆడేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన పందెం రాయుళ్లకు గదులు లేవు. కొన్ని లాడ్జీల్లో ఒక్కొక్క గదిలో పది మందిపైనే ఉండాల్సి వచ్చింది. భీమవరంలో ఒక్కో గది రూ.15 వేల వరకు వెళ్లింది. నరసాపురంలో సింగిల్ గది రూ.4 వేలు, డబుల్ రూమ్ రూ.6 వేలు పలికింది. మామూలు రోజుల్లో వెయ్యి నుంచి రెండు వేలు వుండేది. పోనీ ఇంత సొమ్ము వెచ్చిం చినా పలువురికి గదులు దొరకలేదు. దీంతో కొంత మంది డార్మెటరీలను ఆశ్రయించారు. అక్కడ బెడ్ రూ.వెయ్యి పైనే తీసుకున్నారు. ముందుగా బుక్ చేసుకున్న వారికి తక్కువలో గదులు దొరికితే పండుగ సమయంలో వచ్చిన వారు నానా ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం ప్రాంతాల్లోని లాడ్జీలకు మంచి డిమాండ్ ఏర్పడింది.



• 4 లక్షల కిలోల చికెన్ తినేశారు !

తణుకు, జనవరి 16 : సంక్రాంతి పండుగ మూడు రోజుల్లో జిల్లావ్యాప్తంగా రెండు లక్షల బాయిలర్ కోళ్ళు. అంటే నాలుగు లక్షల కిలోల చికెన్ అమ్మకాలు జరిగాయి. ఆది, సోమ, మంగళవారాల్లో విక్రయాలు జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ మధ్య కాలంలో ఇంత భారీగా విక్రయించడం ఇదే మొదటిసారి. అలాగే ధరలు కూడా భారీగా పెరిగాయి. జనవరి ఒకటో తేదీన లైవ్ కేజీ రూ.90 ఉండగా, తర్వాత రూ.60కు పడిపోయింది. తర్వాత రోజుకు పది రూపాయల చొప్పున పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం స్కిన్ లెస్ కిలో రూ.240, స్కిన్‌తో రూ.220కు అమ్ముతున్నారు. రైతుల వద్ద మాత్రం కోడి లైవ్ ధర రూ.90 మాత్రమే కొనుగోలు చేయడం విశేషం.



• రూ.20 కోట్ల మందు తాగేశారు

భీమవరం క్రైం, జనవరి 16 : సంక్రాంతి నాలుగు రోజులు మద్యం అమ్మకాలు రికార్డులు బద్దలు కొట్టాయి. ఎక్కడికక్కడ కోడి పందేలు, జూదాలు జరగడంతో ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అలాగే చాలా మంది మద్యపాన ప్రియులు వీటిని సేవించడంతో వీటి అమ్మకాలు గత ఏడాదికంటే ఈ ఏడాది రెట్టింపయ్యాయి. గతంలో ఎక్సైజ్ అధికారులు మద్యం అమ్మకాలు లక్ష్యం చేరుకునేందుకు అష్టకష్టాలు పడేవారు. అయితే దానికి విరుద్ధంగా అమ్మకాలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది నాలుగు రోజుల్లో రూ.20 కోట్లు అమ్మకాలు జరిగాయని అధికారులు తెలిపారు. ఈ నెల 13వ తేదీ జిల్లాలో మద్యం అమ్మకాలు రూ.3.42 కోట్లు, ఆదివారం రూ.5.02 కోట్లు, సోమవారం రూ.5.18 కోట్లు, మంగళవారం రూ.5.50 కోట్లు అమ్మకాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఇక ఏలూరు జిల్లాలో రూ.21 కోట్ల విలువైన మద్యాన్ని మద్యం విక్రయించారు.







ఆకివీడు : తలపడుతున్న కోళ్లు

గడువు ముగిసింది!

సంక్రాంతి మూడు రోజులపాటు కోడి పందేలకు పోలీసులు అనధికారికంగా అనుమతులిచ్చారు. గుండాట, కోతాటలు నిర్వహించకూడదని హెచ్చరించినా నిర్వాహకులు మాత్రం లెక్క చేయలేదు. ఆదివారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు యథేచ్ఛగా పందేలు సాగాయి. ఫ్లడ్‌లైట్లలో మరీ పందేలు నిర్వహించారు. ఈ సారి పందెం రాయుళ్లకు పూర్తి స్వేచ్ఛ లభించింది. అనుకున్నట్టుగానే మూడు రోజులు పందేలు సాగాయి. ఆ తర్వాత పోలీసులు అనుమతులను నిరాకరించి పందేలు నిలిపివేశారు. ఇకపై ఆడితే అరెస్టులు చేయడానికి వారు సిద్ధమయ్యారు.

పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా మూడు రోజులపాటు సుమారు రూ.600 కోట్ల మేర కోడి పందేలు, గుండాట, కోతాటల్లో చేతులు మారినట్టు అంచనా వేస్తున్నారు.

కోట్లు.. కొల్లగొట్టి

యథేచ్ఛగా కోడి పందేలు.. గుండాట, పేకాట

- హైకోర్టు ఆదేశాలున్నా భేఖాతరు..
- ఉమ్మడి పశ్చిమలో చేతులు మారిన కోట్లు
- తెలంగాణ, రాయలసీమల నుంచి రాక
- ముగిసిన సంక్రాంతి సంబరాలు

భీమవరం/ఏలూరు క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలు, పోలీసు ఉన్నతాధికారుల హెచ్చరికలను పందెం రాయుళ్లు బేఖాతరు చేశారు. ఏటా మాదిరిగానే ఈ సారి కూడా భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పండుగకు కత్తులు కట్టిన కోళ్ళతో కోడి పందేలు యథేచ్ఛగా నిర్వహించారు. పందెం రాయుళ్లు ఆదివారం ఉదయం నుంచే కోళ్లను బరిలోకి దింపారు. కొద్దిరోజుల నుంచి పోలీసులు, రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్నా, బైండోవర్ కేసులు కట్టినా.. లెక్క చేయలేదు. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని పలుచోట్ల చాపకింద నీరులా 15 రోజుల నుంచే స్టేషన్ రైటర్లు పందెం రాయుళ్ళను బైండోవర్ కేసుల పేరుతో స్టేషన్‌కు పిలిపించి భారీ మొత్తాల్లో ఒప్పందాలు చేసుకుని, కోడి పందేల నిర్వహణకు అనుమతులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. పందేల్లో గుండాట, పేకాట, మద్యం అమ్మకాల నిర్వహణకు నిర్వాహకులు లక్షలు వసూలు చేసుకున్నారు. ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారమంతా నడిచింది. అప్పటి వరకూ పోలీసులు పందేలా నిర్వహించడానికి వీలు లేదంటూ చెప్పిన అధికారులకు ఉన్నతాధికారుల నుంచి సందేశం వచ్చింది. పండుగ మూడు రోజులు కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ చేసుకోండి అంటూ పరోక్షంగా చెప్పడంతో కోడి పందేల పరిసర ప్రాంతాలకు వెళ్ళవద్దని సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం ఉండడంతో చివరకు పోలీసు అధికారులు స్టేషన్లకే పరిమితమైపోయారు. కొంత మంది అధికారులు తమ తెలిసిన వారి ఫోన్లు తప్ప మిగిలిన ఫోన్లు ఈ మూడు రోజులు లిఫ్టు చేయలేదని తెలుస్తోంది. రాజకీయ నాయకులు రాష్ట్ర స్థాయిల్లో ఒత్తిళ్ళు తీసుకువచ్చి చివరకు రాష్ట్రస్థాయి అధికారులతోనే జిల్లా యంత్రాంగంపై ఒత్తిళ్ళు చేసి పందేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చుకున్నట్లు అయిందని చెబుతున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్ళకు తలొగ్గారంటూ విజ్ఞులు విమర్శిస్తున్నారు.

ఈ మూడు రోజుల్లో ఒక్క ఏలూరు జిల్లాలోనే రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకూ పందేల పేరుతో జూదం, గుండాటలలో చేతులు మారాయని తెలుస్తోంది. కొన్ని పందేల్లో అయితే కూర్చుని పందెం చూడడానికి రూ.200 నుంచి వెయ్యి వరకూ టిక్కెట్ పెట్టేశారు. ఇంకా బుల్లెట్లు, ఇతర వాహనాలను బంపర్ బహుమతి అంటూ పందేల్లో బహుమతులు పెట్టారు. మొత్తం మీద సంక్రాంతి పండుగ, కనుమ ముగింపు జరుగడంతో పోలీసులు మంగళవారం సాయంత్రం నుంచి కోడి పందేలా శిబిరాలపై దాడులు మొదలు పెట్టారు. హడావుడిగా పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. పందేలకు అనుమతి ఇచ్చిన నాడు ముందస్తు ఒప్పందాల మేరకే ఈ కేసులు నమోదు చేస్తున్నారని తెలుస్తోంది.



ఇరగవరం : ఓగిడిలో జోరుగా సాగుతున్న గుండాట



చచ్చి గెలిచిన 'కోజా'

ఓడిన పుంజును కోజా అంటారు. గెలిచిన కోడికంటే ఓడి చచ్చిపోయిన పుంజుకే డిమాండ్ ఎక్కువ. కోజా కోసం ఉన్నతస్థాయి అధికారులు, రాజకీయ నాయకుల నుంచి తీవ్ర డిమాండ్ ఉంది. పెంచే సమయంలో వీటికి బాదం, జీడిపప్పు, పిస్తా, ఖైమా వంటి ఆహారాన్ని అందించడంతో మంచి రుచి ఉంటుంది. ఒక్కో కోజా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పలికింది.

- ద్వారకా తిరుమల

పశ్చిమకు తెలంగాణ నుంచి రాక

పశ్చిమ గోదావరి జిల్లాకు తెలంగాణ, రాయలసీమ జిల్లాలనుంచి పందెం రాయుళ్లు అధికంగా తరలివచ్చారు. భారీ మొత్తంలో పందేలు కాశారు. మూడు రోజులపాటు మద్యం ఏరులై పారింది. ప్రభుత్వానికి మూడు రెట్లు ఆదాయం లభించింది. మహిళలు సైతం కోడి పందేలకు సై అన్నారు. పందేలు కాశారు. కుటుంబాలతో సహా పందేలను తిలకించారు. ఈసారి ఆర్కెస్ట్రాలు, నృత్యాలు ఏర్పాటు చేశారు. కాళ్ల మండలం పెద అమిరంలో పాస్‌లు కల్పించారు. వారికే బరిలోకి అనుమతి ఇచ్చారు. కోడితో పాటు బరిలో దిగే వారికి గుర్తింపు కార్డులు మంజూరుచేశారు.

ఇతరులకు బరిలోకి అవకాశం కల్పించలేదు. ఈ ఏడాది ఒక్కో పందేనికి రూ.50 లక్షల వంతున కాసి రికార్డు నెలకొల్పారు. కోడితో బరిలో పాల్గొనాలంటే ఒక పందేనికి రూ.50 లక్షలు చెల్లించాలి. బయట వ్యక్తులు లక్షల్లోనే పందేలు కాశారు. పెద అమిరంలో ఒక్క పందెంలోనే రూ.3 కోట్లు మేర లావాదేవీలు సాగాయి. సీసలిలో అన్ని పార్టీల మద్దతుదారులు బరి నిర్వహించారు. అక్కడ గరిష్టంగా రూ.40 లక్షల వరకు పందెం వెళ్లింది. ఆ రెండు బరుల్లోనే మూడు రోజులపాటు కోట్ల రూపాయలు చేతులు మారాయి. ఉండి నియోజకవర్గంలోని ఓ బరిలో ఐదు పందేలు కోటి రూపాయల వరకు వెళ్లాయి. అంటే ఒక్కో పందేనికి రూ.20 లక్షల వంతున బెట్టింగ్‌లకు పాల్పడ్డారు. వీరవాసరం మండలంలో 12 చోట్ల బరులు నిర్వహించారు. తాడేపల్లిగూడెం మండలంలో ఎనిమిది బరులు వెలిశాయి. అధికార పార్టీ సానుభూతి పరులకే ఈ సారి బరులకు అవకాశం కల్పించారు. జిల్లాలో 80 శాతం బరులు వారి ఆధ్వర్యంలోనే నిర్వహించారు.





పందెం గెలిచి.. బుల్లెట్ బోనస్!

పాలకోడేరు మండలం శృంగవృక్షం బరిలో అత్యధిక కోడి పందే లు గెలవడంతోపాటు రెండు లక్షల 60 వేల విలువైన బుల్లెట్‌ను గెలుచుకున్నారు ఈలి దుర్గా వెంకటశివ. నిర్వాహకులు దీనిని ఆయనకు అందజేసి అభినందించారు.

మహిళలూ సై

యలమంచిలి మండలం కలగంపూడిలో మహిళలు కోడి పందేలు కాశారు. యలమంచిలిలో బరితోపాటు, గుండాట, కోతాటలు నిర్వహించారు. అక్కడ ఆర్కెస్ట్రాలు, నృత్యాలు ఏర్పాటుచేశారు. మహిళలు గుండాటలు ఆడారు. బరి నిర్వాహకులు అందరికీ భోజన వసతులు కల్పించారు. ఉదయం అల్పాహారం మొదలుకుని మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఉండి మండలం మహదేవపట్నం, తాడేపల్లిగూడెం రూరల్ మండలం కొంద్రుప్రోలు, వీరవాసరం మండలాల్లో అత్యధికంగా పందేలు కొట్టిన వారికి బుల్లెట్‌లు బహుకరించారు. నరసాపురం నియోజకవర్గ పరిధిలో ఈ ఏడాది తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో పందె రాయుళ్లు విచ్చేశారు. కోడి పందేలతోపాటు, గుండాట, కోతాటల్లో అధికంగా పాల్గొన్నారు. పెద్ద మొత్తంలో పందేలు కాశారు. గుండాటలో ఈ ఏడాది చిన్నబజార్, పెదబజార్ అంటూ కొత్త ఒరవ డికి తెరలేపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ప్రభాస్, జగన్ ఫొటోలతోనూ గుండాటలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పరిధిలో పడాల, పెద తాడేపల్లి, కొంద్రుప్రోలు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో పెద్ద బరులు ఏర్పాటుచేశారు.



ఉండి : మహదేవపట్నంలో ఎల్‌ఈడీ స్క్రీన్

ప్రజాప్రతినిధులు దూరం

ఈసారి ముఖ్య ప్రజా ప్రతినిధులంతా పందేలకు దూరంగా ఉన్నారు. గతంలో ఉత్సాహంగా బరులు ఏర్పాటు చేసి ప్రారంభించేవారు. అయితే ఈసారి ఆ ఛాయలకు కూడా రాలేదు. తమ వారికి పరోక్షంగా మద్దతు పలికి బరులు నిర్వహించుకు అవకాశం కల్పించారు. అంతా ఎన్నికల మూడ్‌లో ఉండడం వల్లే ఈ సారి ఇటువైపు రాలేదని సమాచారం.



ఆర్టీసీ బస్సులన్నీ కిటకిట

భీమవరం టౌన్, జనవరి 16 : మూడు రోజుల సంక్రాంతి పండుగ ముగిసింది. కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల మధ్య ఈ పండుగను ఘనంగా జరుపుకునేందుకు దూర తీరాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారంతా తిరుగుముఖం పట్టారు. దీంతో భీమవరం ఆర్టీసీ బస్టాండ్ మంగళవారం రాత్రి హైదరాబాద్, విశాఖ పట్నాలకు వెళ్ళే ప్రయాణికులతో కిటకిటలాడింది. హైదరాబాద్‌కు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసినా నిమిషాల వ్యవధిలో రిజర్వేషన్ ఫుల్ అయ్యింది. జిల్లా నుంచి మొత్తం 19 ప్రత్యేక సర్వీసులను పంపినట్లు అధికారులు తెలిపారు. బుధ, గురువారాల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేస్తున్నారు. విశాఖ పట్నంకు కూడా ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నామని చెప్పారు. హైదరాబాద్ వెళ్లే వారితో రోడ్లన్నీ కిటకిట లాడటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగాయి.



కోడి పందేలను తిలకించేందుకు వచ్చిన వారి కార్లు



ఉండి : మహదేవపట్నంలో కోడి పందేల నిర్వహణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బరి



కత్తులు కట్టి మరీ పందేల నిర్వహణ



వైభవం.. ప్రభల ఉత్సవం

ఆచంట, జనవరి 16 : ఆచంట మండలంలో మంగళవారం ప్రభల తీర్థం వేడుకగా నిర్వహించారు. సంక్రాంతి మూడో రోజు కనుమ పండుగ సందర్భంగా వల్లూరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, పెనుమంచిలి గ్రామాలకు చెందిన ప్రభలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకుని ఈ ఐదు గ్రామాల సరిహద్దు గ్రామమైన కందరవల్లి తీసుకువచ్చారు. దీంతో ఇక్కడ తీర్థం జరుగుతుంది. అనేకమంది భక్తులు వచ్చి ప్రభలను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు రాము, ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

తొమ్మిది మంది ఎస్ఐల బదిలీ

భీమవరం క్రైం, జనవరి 16: ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశాలతో పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఎస్ఐలకు స్థాన చలనం కల్పిస్తూ ఎస్పీ రవిప్రకాశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	పనిచేస్తున్న స్టేషన్	బదిలీ స్థానం
డి.హరికృష్ణ	పెంటపాడు	వీఆర్
బి మోహనరావు	భీమవరం రూరల్	పెంటపాడు
జీజే ప్రసాద్	తాడేపల్లిగూడెం టౌన్	వీఆర్
బి.రాజు	తాడేపల్లిగూడెం రూరల్	వీఆర్
జేవీఎస్ ప్రసాద్	భీమవరం సీసీఎస్	తాడేపల్లిగూడెం టౌన్
ఎం.వీరబాబు	మొగల్తూరు	వీఆర్
పి.అప్పారావు	భీమవరం టూటౌన్	తణుకు టౌన్
కె.చంద్రశేఖర్	భీమవరం సీసీఎస్	తణుకు రూరల్
ఎస్ఎన్‌వీ రమేష్	పెనుగొండ	వీఆర్



ద్వారకా తిరుమలలో కనుమ ఉత్సవం భక్తుల గోవింద నామస్మరణల మధ్య వైభవంగా జరిగింది. పల్లకీలో స్వామిని ఊరేగించారు 7లో..



ఆగని అంగన్‌వాడీల నిరసనలు

ఏలూరులో సాష్టాంగ నమస్కారంతో ఇలా..



రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలో తలపడుతున్న జట్లు

దేశానికి యువతే కీలకం

» ఉత్సాహంగా సంక్రాంతి యువజనోత్సవాలు

ఆకివీడు, జనవరి 16: డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా బాలురు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం రాష్ట్రస్థాయి చెడుగుడు, ఉమ్మడి కృష్ణా-పశ్చిమ గోదావరి జిల్లాల స్థాయి వాలీబాల్, జిల్లాస్థాయి చెస్, పాటల పోటీలు, పట్టణస్థాయి రంగవల్లులు, మ్యూజికల్ ఛైర్స్, కరాటే విన్యాసాలు నిర్వహించారు. ఆహ్వానసంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ, దేశానికి యువతే కీలకమన్నారు. కమిటి కన్వీనర్ జోకల రవితేజ, ఆహ్వాన సంఘం కార్యదర్శి ధనుష్, కోశాధికారి బి.రాంబాబు, కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, జి.రాంబాబు, కింజరాపు శంకర్, సందక సూరిబాబు, బత్తిల పార్వతి, బొక్కా వర్మ, సందక ఉదయకుమారి, జోకల లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో క్రీడాధికారులు

ఖేలో ఇండియా పోటీలకు బాలబాలికల జట్టు ఎంపిక

భీమవరం అర్బన్, జనవరి 16: తమిళనాడులోని తిరుచ్చిలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలకు బాలబాలిక జట్టును ఎంపిక చేశారు. మలఖంబ్ క్రీడకు బాలబాలికల రాష్ట్ర జట్టు ఎంపికను మంగళవారం చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో ఏపీ స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పీ సురేంద్ర బాబు, పీ విజయకుమార్, ఎం. శివ, మల్లఖంబ్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీపీసీ శేఖరరాజు పాల్గొన్నారు.

ఎడ్లబండిపై ఊరేగింపుగా అత్తింటికి కొత్తఅల్లుడి

» 29 రాష్ట్రాల నుంచి ప్రత్యేకమై స్వీట్లు.. భీమవరంలో సరికొత్త ట్రెండ్

భీమవరంటౌన్, జనవరి 16 : ఉభయ గోదావరి జిల్లాల్లో ఇటీవలి కాలంలో కొత్త అల్లుడికి సరికొత్తగా ఆహ్వానం పలకడం ఆనవాయితీగా మారుతోంది. ఆషాడం, సంక్రాంతికి వైవిధ్యంగా పండుగ చేయడం సరికొత్త ట్రెండ్‌గా మారింది. భీమవరంలోని వబిలిశెట్టి రామకృష్ణ కుమార్తె లక్ష్మి శిరీష భర్త శిరం నితేష్‌ను ప్రత్యేకంగా అలంకరించిన మూడు ఎడ్లబండ్లపై గంధం వెంకయ్య నాయుడు వీధిలో ఉన్న ఇంటికి సన్నాయిమేళం, నాసిక్ డప్పులు, బాణసంచాతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆ కుటుంబంలోని అల్లుళ్లను కూడా ఎడ్లబండిపై ఊరే గింపుగా తీసుకురావటం విశేషం. సంక్రాంతి రోజున 29 రాష్ట్రాల నుంచి ప్రత్యేకమై స్వీట్లను తయారుచేయించి వాటిని భారతదేశ పటంలో ఉంచి అల్లుడి అందించడం కొత్త ట్రెండ్‌ను సృష్టించింది. సంక్రాంతికి కొత్త అల్లుడికి అతిథి మర్యాదలకు లోటుండదు.



ఎడ్లబండిపై వస్తున్న కొత్త అల్లుడు



29 రకాల ప్రత్యేకమైన స్వీట్లు



ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షిస్తున్న కొండరెడ్లు

కొండరెడ్ల అభివృద్ధికి జన్‌మన్

బుట్టాయగూడెం, జనవరి 16: పశ్చిమ ఏజెన్సీలోని కొండరెడ్లను జన్‌మన్ ద్వారా అభివృద్ధి పరచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మోటా మినీస్ట్రి సెక్రటరీ సుశీల్, కెఆర్ పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి మోదీ పాల్గొన్న జన్‌మన్ కార్యక్రమాన్ని లైవ్‌లో ప్రచారం చేయగా కొండరెడ్లు డిజిటల్ స్క్రీన్‌పై వీక్షించే ఏర్పాట్లను చేసింది. జన్‌మన్ కొండరెడ్లను అభివృద్ధి పరచేందుకు అమలు చేయడం జరుగుతుందన్నారు. జన్‌మన్‌పై కొండరెడ్ల గ్రామాల్లో పర్యటించి వివరించడం జరిగిందన్నారు. వ్యవసాయం, విద్యుత్, వ్యక్తిగత, గ్రూపు రుణాలు, భూమి అభివృద్ధి తదితర 16 రకాల అంశాలను కొండరెడ్ల అభివృద్ధికి అమలు చేస్తున్నట్లు తెలిపారు.



వృద్ధులతో ముచ్చటిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

వృద్ధ మాతలతో ఎన్‌సీసీ కేడెట్లు

» ఆత్మీయ పలకరింపులతో ఆనందోత్సాహాలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 16: కన్నబిడ్డలు, కుటుంబ సభ్యుల నిరాదరణకు గురై మాదేపల్లిరోడ్డులోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో తలదాచుకుంటున్న 52 మంది వృద్ధ మహిళలకు ఎన్‌సీసీ కేడెట్లు సంక్రాంతి పండుగ రోజు ఆనందోత్సాహాలను పంచి వారిలో మానసికోల్లాసాన్ని నింపారు. 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో 350 మంది ఎన్‌సీసీ కేడెట్లు మంగళవారం ప్రేమాలయాన్ని సందర్శించారు. వృద్ధ మాతలను ఆప్యాయంగా పలకరించి పండ్లు, మిఠాయిలు, డ్రింక్‌లను అందజేశారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్.ముఖర్జీ మాట్లాడుతూ, నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు ఆత్మీయపలకరింపు ఓ టానిక్‌లా పనిచేస్తుందన్నారు. ఈ నెల 20వరకు క్యాంపు జరుగుతుందని వివరించారు. ప్రేమాలయ నిర్వాహకులు మాట్లాడుతూ, భవన నిర్మాణానికి సినీనటుడు చిరంజీవి కోడలు ఉపాసన రూ.25 లక్షలు అందజేశారని, ఔషధాలను అపోలో హాస్పిటల్స్ ద్వారా అందజేస్తున్నారని వివరించారు. ఎన్‌సీసీ డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ సురేంద్రన్, సుబేదార్ ఆదినారాయణ, ఎన్‌వోలు మౌనిక, శేఖర్, రమ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు ఆక్సిజన్!

టీడీపీ అధినేత చంద్రబాబు ఆక్వారైతుల్లో ఆశలు రేకెత్తించారు. పెరిగిన మేత ధరలు, విద్యుత్ సబ్సిడీలు తగ్గడం, రొయ్యల ధరలు పతనమవడంతో తీవ్ర నిరాశ నిస్పృహల్లో ఉన్న ఆక్వా రైతన్నలకు ఆచంట మహాసభలో చేసిన ప్రకటన ఆక్సిజన్ ఇచ్చింది. ప్రస్తుత పరిస్థితులకు పూర్తి భిన్నంగా అన్నింటికీ సిబ్సిడీలు వర్తింపజేస్తామని చెప్పడం, మేత ధరలు తగ్గిస్తామని, ఆక్వాజోన్‌తో సంబంధం లేకుండా విద్యుత్ యూనిట్ రూ.1.50కు, సబ్సిడీతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు తోడ్పడతామని చెప్పడంతో రైతుల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వారిలో కొత్త ఆశలు చిగురించాయి.



ఆచంట సభలో ప్రకటన చేస్తున్న చంద్రబాబు (ఫైల్), మద్దతు ధర లేని రొయ్యలు

ఆకివీడురూరల్ జనవరి 16: ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లాలో 1,80,000 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. అనుమతి పొందని మరో 50వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు.చంద్రబాబు హయాంలో ఇచ్చిన ప్రోత్సాహకాలతో జిల్లాలో 2014-2019 మధ్య ఆక్వా సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సబ్సిడీపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, యూనిట్ కేవలం రూ.1.50కే ఇవ్వడం, నాణ్యమైన సీడ్ లభించడం, ధరలు అదుపులో ఉండటంతో ఆక్వా ద్వారా సుమారు రూ.25 వేల కోట్లు వార్షికాదాయం వచ్చేది. విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఆక్వాసాగు చేస్తున్న వారందరికి యూనిట్ ధర కేవలం రూ.1.50, 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కేవలం సబ్సిడీతో రూ.1.10 లక్షలకే ఏర్పాటు చేసేవారు. దీంతో వ్యవసాయాన్ని మార్పు చేసి ఆక్వా సాగువైపు మొగ్గు చూపారు. ఆక్వాసాగుకు అవసరమైన పరికరాలు సబ్సిడీపై అందజేసి ప్రోత్సహించారు.

వైసీపీ పాలనలో ఆక్వా అధోగతే ..

టీడీపీ హయాంలో ఉవ్వెత్తున లేచిన ఆక్వాసాగు వైసీపీ పాలనలో ఢమాల్ అంది. దీనికి ప్రభుత్వ నిర్ణయాలే కారణమని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్వాజోన్ పేరుతో రైతులకు విద్యుత్ సబ్సిడీని నిలిపివేసిందని, ముందుగా ఐదు ఎకరాలు ఆ తరువాత 10 ఎకరాలకు పెంచుతూ సహేతుకమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వలన విద్యుత్ సబ్సిడీ పొందలేక నష్టాల పాలయ్యారు. 40 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రూ.2.43 లక్షలకు పెంచడం .. సబ్సిడీ లేకపోవడం వారిని మరింత ఇబ్బందుల పాల్జేసింది. ధరలు పతనమవుతున్నా, నష్టాల పాలవుతున్నా పట్టించుకోకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మేతలు, మందుల ధరలు విపరీతం గా పెరిగిపోవడం, రొయ్యలు ధరలు తగ్గిపోవడం, వ్యాపారులు సిండికేటై ధరలు తగ్గించేసినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో ఆక్వారంగం సంక్షోభంలో కూరుకుపోయింది. నష్టాలు తట్టుకో లేక, అప్పులు పాలై రైతులు సుమారు 30వేల ఎకరాలలో సాగు ఆపేసారని సమాచారం. ఉమ్మడి జిల్లాలో సుమారు 21,000 విద్యుత్ కనెక్షన్లు ఉండగా 16,800 కనెక్షన్లకు సబ్సిడీ వర్తిస్తుండగా మరో 4,200 కనెక్షన్లకు సబ్సిడీ లేక ఇబ్బందులు పడుతున్నారు. అతి తక్కువ సమయంలో అధికాదాయం ఆర్జించే ఆక్వారంగం సంక్షోభంలో ఉండటం మిగిలిన అన్ని రంగాలపై ప్రభావంచూపుతోంది. మార్కెట్‌లో అన్ని రంగాలు వ్యాపారాలు లేక వెలవెలబోతున్నాయి. పండుగలు సైతం సాదాసీదాగానే జరిగిపోతున్నాయి. ప్రజల్లో ఇదివరకు ఉన్న హడావుడి, ఆనందోత్సాహాలు లేకుండా పోయాయి.

చంద్రబాబు ప్రకటనతో ఆశలు

- » మేతల ధరలు, మద్దతు ధర, సాగు ప్రోత్సాహంపై నూతనోత్సాహం
- » సంక్షోభానికి తెరపడుతుందని ఆనందం
- » జోన్ పేరుతో వైసీపీ దగా..
- » ఉమ్మడి పశ్చిమలో 1,80,000 ఎకరాల్లో సాగు

వైసీపీవి మోసపూరిత వాగ్దానాలు



కోట్లాది రూపాయలు విదేశీయ మారకద్రవ్యం తీసుకువస్తున్న ఆక్వా రైతుల నడ్డిని వైసీపీ ప్రభుత్వం విరిచింది. విద్యుత్ సబ్సిడీని ఎత్తివేయడానికి అనేక సాకులు చూపింది. మోసపూరితమైన వాగ్ధానాలతో తీవ్రంగా నష్టపోయారు.

భూపతిరాజు తిమ్మరాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు

సంక్షోభంలో ఆక్వారంగం



ప్రభుత్వఅసంబద్ధ నిర్ణయాలతో ఆక్వారంగం సంక్షోభంలో ఉంది. విద్యుత్ యూనిట్ల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. విన్నపాలు పట్టించుకున్న నాథుడే లేడు.

-ముత్యాల బుజ్జి, వెస్ట్ గోదావరి ప్రాన్ ఫార్మర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు

గణనీయంగా తగ్గిన సాగు



ప్రభుత్వ నిర్ణయాల వలన సాగును గణనీయంగా తగ్గించేశారు. పెట్టుబడులు కూడా రావడం లేదు. ఆర్థిక స్తోమత లేక లీజుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రొయ్యలసాగు ఆపేసి చేపల వైపు దృష్టి మరలిస్తున్నారు.

-దొరపురెడ్డి కన్నబాబు, ఆక్వారైతు-కోళ్లపర్రు

వ్యాపారులను నియంత్రించే చర్యలు నిల్



వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్వారంగం ఘోరంగా తయారైంది. నాణ్యతలేని సీడ్, ఫీడ్, మందులు, ధరలు ఆకాశన్నంటుతుంటే, రొయ్యల ధరలు పతనమైపోయాయి. వ్యాపారులను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం లేదు.

- మద్రివాడ వెంకట్రావు, ఆక్వారైతు-చినకాపవరం

ప్రాణం పోతే పళ్లెంలోకే..

- » పందెంతో పేగు తెంపుకుంటున్న కోడిపుంజు
- » రక్తమోడుతూనే రణభూమిలో తొడగొడుతోంది
- » మానవానందం కోసం మరణంతో పోరాటం

(ఆంధ్రజ్యోతి - ఏలూరు)



నిద్ర లేపడమే తెలిసిన నన్ను శాశ్వత నిద్రలోకి పంపడమే ధ్యేయంగా పెట్టుకున్న మీకు ఎన్నో సార్లు నామొర వినిపించాలనుకున్నాను. నాది వృథా ప్రయాసేనని మిన్నకుండిపోతున్నాను. నా పిచ్చిగానీ కత్తి కట్టొద్దన్న కోర్టు నిర్ణయానికే విలువ ఇవ్వని మీకు, నోరు లేని నా ప్రాణమో లెక్క! మీ నోళ్లకు ముక్కగా మారడానికే పుట్టానా? అన్నట్లుగా ఉండే మీ ఆలోచన కిలోల లెక్క తూచి మరీ పంచుకుంటున్న నా ప్రాణాన్ని పట్టించుకుంటుందను కోవడం నా భ్రమే. అయినా నా అవేదనను అర్థం చేసుకునేవారి కోసం ప్రతీ ఏటా ఎదురుచూస్తూనే ఉన్నాను. ఒక్కరికైనా అర్థమవుతుందని వెతుకుతున్నాను. తృణ ప్రాయంగా నా ప్రాణాన్ని మట్టిలో కలుపుతున్న మిమ్మల్ని ఒక్కసారి ప్రశ్నించాలని నోరు తెరుస్తున్నాను.

మీకు అల్పాహారంలో నేనే కావాలి.. మధ్యాహ్న భోజనంలో నా శరీరమే కావాలి, చివరకు నిద్రపోయే ముందు కూడా నేనే తోడై ఉండాలి. మీకు ఆకలి గుర్తొచ్చినపుడల్లా.. మధువు పెదవి దాటినప్పుడల్లా నా ఆయువును హరిస్తూనే ఉన్నా. ప్రత్యేకంగా పండుగ పేరుతో శారీరకంగా నన్ను ఛిద్రం చేసి మరీ హింసించడంలో ఉన్న ఆనందమేమిటో అర్థం కావడంలేదు. పేగు తెగి బరిలో వేలాడుతున్నా. నీ పందేనికే కట్టుబడి పోరాడే నన్ను, చీలిన నా పొత్తి కడుపును చూస్తూ మీరు కొట్టే చప్పట్లు, ఈలలు ఒడిగట్టే నా ప్రాణాన్ని హేళన చేస్తున్నాయి. ప్రాణమిస్తూ కూడా మీ నుంచి గౌరవాన్ని కూడా పొందలేని నా జీవితంపై నాకే అసహ్యం పుడుతోంది. ఏం చేస్తే నాపై మీకు కనికరం కలుగుతుందో తెలుసుకోవాలన్న నా ఆవేదన అరణ్య రోధనే అవుతోంది. ప్రాణం పోతే పళ్లెంలోకి.. నిలబడితే మరోమారు బరిలోకి తోస్తూ జేబులు నింపుకునే మీ ప్రవర్తనను ఛీ కొట్టలేని నా కర్మను, నా బతుకుపై నేనే చీదరగా మార్చుకుంటున్నాను.

నా జాతితోనే నన్ను పోరాడమంటూ బరిలోకి తోస్తూ.. జాతి మూకుమ్మడి హత్యలకు నన్నే మూల కారకుడ్ని చేస్తున్న మీ కర్కశత్వానికి నా అశ్రుతాంజాలి సమర్పిస్తున్నాను. కీటకాలతో కడుపు నింపుకుంటూ.. మీ ఇంటి చుట్టూ పిల్లలతో తిరుగాడుతూ.. పాము,పుట్ర వస్తే అడ్డుకునే మాకు ఆస్తి కోసం అన్నదమ్ములతో, తల్లిదండ్రులతో పగను పెంచుకునేంత జీవితాన్ని ఆ దేవుడు ఇవ్వలేదు. అలాంటి మాపై ఇంతటి ఆగ్రహం ఎందుకు ప్రదర్శిస్తున్నారో తెలుసుకోవాలనుంది. అంతో ఇంతో ప్రేముండబట్టే నోరు లేకపోయినా మా జాతిని కాపాడుకోవడానికి మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. కత్తులు చేతపట్టించి బరిలోకి తోసి మీలో మీరు కొట్టుకు ఛావమన్న క్షత్రియ కాలాన్ని గుర్తు చేసుకుంటూ మీ ప్రాణాలకు బదులు మా గొంతుకలను పణంగా పెడుతూ వికటాట్టహాసం చేసే ఈ ప్రవర్తనను ఏ కోడీ హర్షించలేక పోతుంది. ఇదేం బతుకు దేవుడా అని ఆ భగవంతున్ని వేడుకునే లోపే బలిపేరిట ఆయనకూ నన్ను ప్రసాదం చేస్తున్నారు. మీ కోర్కెలకు పావుగా ఉపయోగించుకుంటున్న ఓ మనిషీ నాదీ ప్రాణమేనని గుర్తుంచుకోవయ్యా! ఏం చేస్తే గుర్తిస్తావో పోనీ చెప్పవయ్యా! దశాబ్దాల నా బలిదానం నీ మనసును కరిగించకపోయినా నీ బిడ్డల మనసునైనా కరిగిస్తే దుర్భర బతుకు నుంచి మా జాతికి భవిష్యత్తులోనైనా రక్షణ దొరుకుతుందన్న ఆశతో నీ పందెంలో బలిపీఠమెక్కుతాను.

మూగగా చూస్తూ మా శవాల్ని మోస్తున్న బరులైనా మా ఆర్తనాదాల్ని వింటే ఎంత బావుణ్ను! మేము మీకు సహకరించబోమంటూ పందెం రాయుళ్లకు అడ్డం తిరిగితే మా ప్రాణాలు నిలుస్తాయి కదా! వేదన భ్రమే కానీ.. మనసున్న మనిషే కరగనంటుంటే భారం మోసే భూ మాత ఎలా వినగలదు? కోడి సగటు జీవిత కాలం ఎంతో కూడా తెలియని పందెం రాయుళ్లు కొలతలు వేసి మరీ బరులు సిద్ధం చేస్తూ పండుగను మాకు మరణ వేదిక చేస్తూ బరుల్ని స్వర్గపురిగా మారుస్తున్నారు. చేతికి కత్తి గుచ్చుకుంటే అమ్మా.. అని పిలిచే భాగ్యం లేని మాపై కాస్త కనికరం చూపించాలన్న ఈ అభ్యర్థనను ఒక్క క్షణం ఆలోచించినా వేల సంఖ్యలో మా జాతి ఊపిరి పీల్చుకుంటుందని మర్చిపోకండి. ఒక్క నిమిషం ఆలోచించండి.

సబ్ కలెక్టర్, డీఎస్పీ దాడి చేసినా..
జోరుగా కోడిపందేలు, జూదం

పెనుమంట్ర, జనవరి 16 : మండలంలో నెగ్గిపూడి, మార్టేరు, ఆలమూరు గరువు, నత్త రామేశ్వరం గ్రామాల్లో కోడిపందేలు, జూదం జోరుగా సాగాయి. గరువు కోడిపందేల స్థావరంపై నరసాపురం సబ్ కలెక్టర్, డీఎస్పీ మనోహరాచారి సిబ్బందితో మంగళవారం దాడులు చేసి నిలుపుదల చేశారు. నలుగురు వ్యక్తుల్ని, రెండు కోడి పుంజులు, గుండాట బోర్డులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యథావిధిగా పందేలు, గుండాటలు సాగాయి. ఫ్లడ్ లైట్లు వెలుగులో మూడు రోజులు పందేలు, పేకాట, గుండాట, కోత ఆటలు విచ్చలవిడిగా జరిగాయి. బరితెగించి మరీ పందెంరాయుళ్ల పందేలు, జూదం నిర్వహిస్తే పోలీస్ అధికారులు పత్తా లేకుండా పోయారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లాది రూపాయలు చేతులు మారాయి. దీంతో కొందరు జేబులు ఖాళీ చేసుకొని తిరిగి సొంత ఊళ్లకు ప్రయాణమై వెళ్లారు.

కోజాల మాంసానికి యమ డిమాండ్

పందెంలో ఓడిపోయిన కోడిని కోజాగా పిలుస్తారు. దీని మాంసానికి మార్కెట్లో డిమాండ్ పెరిగింది. కేజీ రూ.1,500 నుంచి రెండు వేలు పలికింది. పందెం కోళ్లను బాదం పిస్తా , కైమా వంటి పోషక ఆహారాన్ని పెట్టి పందేలకు సిద్ధం చేస్తారు. దీంతో అధిక ప్రోటీన్లు ఉన్న కోజాకు డిమాండ్ పెరిగింది.



దొరసానిపాడులో ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

అట్టహాసంగా శ్రీవారి పార్వేటి ఉత్సవం

» దొరసానిపాడు కనుమ మండపంలో విశేష పూజలు

ద్వారకాతిరుమల, జనవరి 16: చిన్నతిరుమలేశుని పార్వేటి మహోత్సవం (కనుమఉత్సవం) భక్తుల గోవిందనామస్మరణలు, అర్చకుల వేదమంత్రోచ్చరణలు, కేరళ వాయిద్యాలు, డోలు, సన్నాయి, చిత్రవిచిత్రవేషధారణల నడుమ మంగళవారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. ఉభయదేవేరులతో శ్రీవారిని రాజాధిరాజ వాహనంపై ఉంచి ప్రధాన రాజగోపురం మీదుగా గజ, అశ్వసేవల నడుమ పురవీధులకు పయనమై దొరసానిపాడుకు తరలివెళ్లారు. మహిళలు స్వామి వాహనం వచ్చే దారిపొడవునా రంగవల్లులతో తీర్చిదిద్దారు.

ఉత్సవ వైభోగం ఇలా.. శ్రీవారి క్షేత్రం నుంచి ఊరేగింపుగా వెళ్లిన స్వామివారు అక్కడి కనుమమండపం వద్ద భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదేవేరులతో శ్రీవారిని ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలను నైవేద్యం చేశారు. భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం శ్రీవారు గిరిప్రదక్షిణగా శేషాచలకొండ మార్గాన తిరుగుతూ అట్టహాసంగా ఆలయానికి చేరుకున్నారు. ప్రతిఏటా శ్రీవారు కనుమ పండుగ రోజు మాత్రమే క్షేత్రాన్ని విడిచి పొరుగు గ్రామానికి వెళ్లడం ఇక్కడి విశిష్టత.



స్వామికోసం దొరసానిపాడులో ఎదురుచూపు

శ్రీవారి క్షేత్రం నుంచి మేళతాళాలు.. శక్తి వేషాలతో..

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

పోలవరం, జనవరి 16 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన పట్టిసీమ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలివి. కొత్తపట్టిసీమకు చెందిన మజ్జి శ్రీనివాస్ (41) తన తల్లి దైవశిరోమణితో కలిసి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రాంపాలెం బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా పట్టిసీమ-కొత్తపట్టిసీమ గ్రామాల మధ్య ఎదురుగా వచ్చి మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి దైవశిరోమణి, మరో ద్విచక్రవాహనదారుడైన ఉస్సే కిరణ్ కుమార్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వారిని 108లో మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

» ఎంపీటీసీ ఇంటి వద్ద మృతుడి బంధువుల ఆందోళన



మృతదేహంతో ఎంపీటీసీ ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న మృతుడి బంధువులు



ఫణీంద్ర (ఫైల్)

కలిదిండి, జనవరి 16 : కొండంగి గ్రామానికి చెందిన కోకా ఫణీంద్ర (27) రొయ్యల చెరువుల వద్ద ఉన్న పాకలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం తన సోదరుడి కుమార్తెతో మృతుడు చనువుగా ఉండటంతో ఎంపీటీసీ ఇమ్మానేని లక్ష్మణరావు ఫణీంద్రను హత్య చేయించాడంటూ మంగళవారం కొండంగిలో ఎంపీటీసీ నివాసం వద్ద మృతుడి బంధువులు ఫణీంద్ర మృతదేహంతో ఆందోళన చేశారు. ఎంపీటీసీ ఇంటిని, కారును ధ్వంసం చేసి ఎంపీటీసీని అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎంపీటీసీ లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కైకలూరు సీఐ కృష్ణకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కలిదిండి ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి దుర్మరణం

భీమవరం క్రైం, జనవరి 16 : సిమెంట్, కంకర లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ మంగళవారం తిరగబడటంతో డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలివి. చినఅమిరంకు చెందిన పేరుకుల నాగ సత్యనారాయణ (36) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్రాక్టర్‌పై సిమెంట్, కంకర వేసుకుని వెళ్తుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టును ఢీకొని డ్రెయిన్‌లోకి దూసుకెళ్లి తిరగబడింది. ట్రాక్టర్ కిందపడి సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీఐ జి. శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిశు గృహంలో నెలల చిన్నారి మృతి

ఏలూరు క్రైం, జనవరి 16 : నగరంలోని విద్యానగర్ శిశుగృహంలో నెలల శిశువు షాలిని మృతి చెందింది. ఈ ఘటనపై శిశుగృహ మేనేజర్ భార్గవి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందించడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ శిశువు తల్లిదండ్రులు అనారోగ్యంగా ఉండడంతో చిన్నారిని శిశు గృహంకు అప్పగించారు. అనారోగ్యం కారణం వల్లే ఆ శిశువు మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. శిశువుకు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మంగళవారం రాత్రి శవపంచనామా పోలీసులు నిర్వహించారు.

పేకాట, గుండాటపై దాడి

» పోలీసుల అదుపులో 32 మంది.. రూ.27 వేలు స్వాధీనం

పాలకోడేరు, జనవరి 16 : మండలంలో తొమ్మిది గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాటలపై దాడి చేసి 32 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు కోళ్లు, ఆరు కత్తులతో పాటు రూ.27,500 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ హజరయ్య తెలిపారు. పాలకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు, కోరుకొల్లు, మోగల్లు, వేంద్ర, శృంగవృక్షం, పెన్నాడ, విస్సాకోడేరు గ్రామాల్లో పందేలపై దాడి చేశామని పోలీసులు చెప్పారు.

భర్త కొట్టాడని.. వివాహిత ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 16: మద్యం మత్తులో భార్యను కొట్టడంతో మనస్థాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పడాలలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలివి. పడాలకు చెందిన ఉడుమూడి జేమ్స్‌కు, కొమ్ముగూడెంకు చెందిన నాగమణి (20)తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంత కాలంగా జేమ్స్ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. ఆదివారం జేమ్స్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవపడ్డాడు. భార్యను కొట్టడంతో మనస్థాపంతో ఇంట్లోకి వెళ్లి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన జేమ్స్ స్థానికుల సాయంతో తలుపులు పగలకొట్టారు. దూలానికి వేలాడుతున్న నాగమణిని కిందకు దించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆమెకు ఆర్ఎంపీ సాయంతో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108కు సమాచారం అందించారు. వాహనం వచ్చేలోపు నాగమణి మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేరుపాలెం బీచ్‌లో యువకులపై దాడి



చికిత్స పొందుతున్న గణేశ్

మొగల్తూరు, జనవరి 16: మద్యంమత్తులో తెలంగాణ యువకులు గోదావరి జిల్లా యువకులపై దాడికి పాల్పడ్డ ఘటన పేరుపాలెం బీచ్‌లో సోమవారం రాత్రి జరిగింది. తూర్పు గోదావరి జిల్లా కోనసీమకు చెందిన గణేశ్ నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలివి. మూడు వాహనాల్లో పేరుపాలెం సముద్రం వద్దకు తెలంగాణ యువకులు వచ్చారు. ఎంజాయ్ చేసి తిరిగి వెళ్తూ రోడ్డుకు అడ్డంగా కార్లు నిలిపారు. వెనుక వస్తున్న కోనసీమ జిల్లా యువకులు కార్లు అడ్డంతీయమని అడగ్గా వారిపై రాడ్లతో దాడికి దిగారు. ఈ ఘటనలో గణేశ్‌తో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అక్కడికి రాగానే తెలంగాణ యువకులు ఓ కారును విడిచి మరో రెండు కార్లలో ఉడాయించారు. క్షతగాత్రులను నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రతో దాడి.. ఒకరి మృతి

» స్నేహితుల మధ్య వివాదం-నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు క్రైం, జనవరి 16 : స్నేహితుల మధ్య తలెత్తిన వివాదంతో ఓ వ్యక్తి మరో వ్యక్తి తలపై కర్రతో కొట్టడంతో తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. ఈ ఘటనలో హంతకుడిని 24 గంటలు గడవకముందే పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివి. ఏలూరు హనుమాన్‌నగర్‌కు చెందిన లక్కోజు సురేష్ (43) టైలరింగ్ చేస్తాడు. పదేళ్ల క్రితం భార్య బిడ్డలను వదిలివేసి ఒంటరిగా ఉంటున్నాడు. అతడికి అమీనాపేటనకు చెందిన కైతేపల్లి వంశీకుమార్ స్నేహితుడు. వీరిద్దరు కలిసి ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి వంశీ కుమార్ ఇంట్లో భోజనం చేశారు. ఇద్దరి మధ్య చిన్న వివాదంతో వాగ్వాదం జరిగింది. ఘర్షణ పడ్డారు. వంశీకుమార్ తల్లిని సురేష్ దుర్భాషలాడాడు. 15వ తేదీ ఉదయం ఐదు గంటల సమయంలో అక్కడ నుంచి సురేష్ వెళ్తుండగా వెనుక నుంచి కర్ర తీసుకువచ్చిన అతడి తలపై బలంగా కొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వంశీ కుమార్ అక్కడ నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై త్రీ టౌన్ సీఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేయగా డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాన్ని పోలీసు జాగిలాలతో, క్లూస్ టీమ్‌తో పరిశీలించారు. ఈ హత్య వంశీకుమారే చేశాడని నిర్ధారణకు వచ్చి మంగళవారం ఉదయం అతడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. సీఐ ను, ఎస్ఐలు ఎస్‌కె మదీనాబాషా, అజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుళ్ల ఓం ప్రకాష్, ఏసు, కానిస్టేబుళ్ల ఇస్సాకు, హేమసుందర్, రాజేంద్ర ప్రసాద్‌ను డీఎస్పీ అభినందించారు. త్రి టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.

అడుగంటిన కాల్వల నీరు

ఆకివీడు రూరల్ జనవరి 16 : చెరుకుమిల్లి గ్రామంలో వెంకయ్యవయ్యేరు కాలువలో నీరు అడుగంటింది. ఆకుమడులు సమయంలో కాలువలో నీరు అడుగంటిందని, కనీసం మంచినీటి చెరువులు నింపుకుందామనుకున్నా నీరందడంలేదని చెరుకుమిల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకులు నగేష్‌రాజు అన్నారు. కాలువ పూర్తిగా కలుషితమైపోయిందని అన్నారు. సాగునీరు అందక నారుమడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలకు భోజనం, వస్త్రాల పంపిణీ



ఆకివీడు రూరల్ జనవరి 16 : చెరుకుమిల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సుమారు 70 మంది పేదలకు కురిటీ లక్ష్మయ్య, అచ్చాయమ్మల సేవా సంఘం అధ్యక్షుడు కురిటి శ్రీను ఉచితంగా భోజన సౌకర్యాలు కల్పించి, దుప్పట్లు, పండ్లు, నగదు పంపిణీ చేశారు. కాలువకు రేవు కట్టించడం, సేద తీరేందుకు పార్కు ఏర్పాటు చెయ్యడం, మృతదేహాల కోసం ఫ్రీజర్‌ను ఉచితంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కుముదవల్లిలో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎంపీ రఘు రామకృష్ణంరాజు

పాలకోడేరు, జనవరి 16 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రతీ 5 సంవత్సరాలకు ఒక సారి గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామం అని నర్సాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. కుముదవల్లి గ్రామంలో సోమవారం కుముదవల్లి గ్రామ ఆత్మీయ సమ్మేళనాన్ని గ్రామస్తులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ప్రతీ ఐదు సంవత్సరాలకి ఒకసారి కుముదవల్లి గ్రామం వచ్చి ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకోవాలి అన్న ఆలోచన చాలా బాగుందన్నారు. ఈ సందర్భంగా ఎక్కడె క్కడో స్థిరపడి దుబాయ్, ఆస్ట్రేలియా, యుఎస్, జర్మనీ తదితర దేశాల నుంచి ఎంతో మంది ప్రముఖులు గ్రామానికి వచ్చి జ్ఞాపకాలను పంచుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, గ్రామ సర్పంచ్ భూపతిరాజు వంశీకృష్ణంరాజు, భూపతిరాజు రవికుమార్‌రాజు, నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు, కలిదిండి రామచంద్రరాజు, భూపతిరాజు రామకృష్ణంరాజు, భూపతిరాజు వాసు, భూపతిరాజు నాగేంద్రవర్మ, కృష్ణవర్మ, భూపతిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు ఎంపీ పూజలు

భీమవరం టౌన్, జనవరి 16 : మావుళ్ళమ్మ అమ్మవారిని సోమవారం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. ముందుగా అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు ఆయనపేరిట పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. ఆయన వెంట ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను, కోళ్ళనాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎంపీ రఘురామను కలిసిన టీడీపీ నాయకులు

వీరవాసరం, జనవరి 1 : నర్సాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణం రాజును భీమవరంలోని వారి స్వగృహంలో వీరవాసరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పరిషత్ అధ్యక్షులు వీరవల్లి దుర్గాభవాని, చంద్రశేఖర్‌లు ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అందరి సహకారం కావాలన్నారు. ఎంపీని కలిసిన వారిలో మళ్ళ శ్రీరామమూర్తి, మండల తెలుగు యువత అధ్యక్షుడు పంన సుధాకర్, మండల ఐ-టీడీపీ అధ్యక్షులు కడలి వాసు, సీనియర్ నాయకులు పంజా వెంకటేశ్వరరావు, గణేశుల రామారావు, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కౌరు బాస్కరరావు, తెలుగు యువత కౌరు శివకృష్ణ పాల్గొన్నారు.



రఘురామను కలిసిన టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని, మాజీ ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు టౌన్: నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణం రాజును మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ పుష్పగుచ్చాలు అందచేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కొద్దిసేపు ఇరువురు రాజకీయ అంశాలను చర్చించుకున్నారు. గన్ని వీరాంజనేయులు, కోళ్ల నాగేశ్వరరావు, ధనరాజు, విన్నకోట వెంకట రమణ శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

తణుకు: నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణరాజును మంగళవారం ఆయన నివాసంలో తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు కలగర వెంకట కృష్ణ, పితాని మోహన్, గోపిశెట్టి రామకృష్ణ, ఆదినారాయణ, ఒమ్మి రాంబాబు, అడ్డాడ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

మొగదారమ్మకు జాయింట్ కమిషనర్ పూజలు



మొగల్తూరు, జనవరి 16: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పేరుపాలెం సౌత్‌లో బంధువుల ఇంటికి తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్. శ్రీలీల ఆమె భర్త నాగేంద్రకుమార్‌తో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా మొగదారమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు శ్రీలీల దంపతులకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

విజేతలకు బహుమతులు అందజేత

మొగల్తూరు, జనవరి 16: పేరుపాలెం మొగదారమ్మ జాతర పురస్కరించుకుని ఈ ఏడాది ముగ్గులు, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో విజేతలకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు కొవ్వలి యతిరాజు రామ్మోహన్ నాయుడు, జిల్లా తెలుగుదేశం మహిళా విభాగం అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మీ చేతుల మీదగా బహుమతులు అందించారు.

నేటి నుంచి ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

భీమవరం అర్బన్, జనవరి 16: భీమవరంలోని పుల్చపలపల్లి సుందరయ్య భవనంలో వసుధ ఫౌండేషన్, ఎటీఎస్‌వీకేలు సంయుక్తంగా బుధవారం నుంచి ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం ద్వారా ఊబకాయం, సయాటికా రక్తపోటు, మూత్రపిండాలు, మోకాళ్ళ నొప్పులు వంటి అనేక రోగాలు నయం చేస్తారన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు

పెంటపాడు, జనవరి 16: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 18న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపిరి తిత్తులు, చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు ఉచితంగా సేవలందిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీవైఎఫ్ఐ పోటీలు

భీమవరం అర్బన్, జనవరి 16: సంక్రాంతి సందర్భంగా భీమవరంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి పట్టణ నాయకులు వైకుంఠరావు, చల్లబోయిన వెంకటేశ్వరరావు బహుమతులు అందించారు.

కేసుల నమోదు

ఆకివీడు, జనవరి 16: ఆకివీడు మండలంలో మంగళవారం 10 వివిధ కేసుల్లో 24 మందిని అదుపులోకి తీసుకొని రూ.22,820 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. వీటిలో పేకాటకు సంబంధించి-7, కోడి పందేలు-3 అన్నారు.



కాళ్లలో పందేనికి కోళ్లు సిద్ధం.. మొగల్తూరు, తాడేపల్లిగూడెంలలో కోడి పందేలు.. భీమవరంలో పందేలు జరుగు ప్రాంతంలో మోటార్ సైకిళ్ల పార్కింగ్.. ఆకివీడులో కోడి పందేల బరి వద్ద మద్యం సరఫరా

కోడ్ది

- జోరుగా పందేలు
- యథేచ్ఛగా గుండాట, పేకాటలు
- ఏరులై పారిన మద్యం
- చేతులు మారిన కోట్లాది రూపాయలు
- పందేలు తిలకించిన ప్రజా ప్రతినిధులు

ఆకివీడు/పాలకోడేరు/నరసాపురం/భీమవరం క్రైం/యలమంచిలి/మొగల్తూరు/పోడూరు/పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్/తణుకు/ఉండి/ఇరగవరం, జనవరి 16: సంక్రాంతి వేళ కోడి పందేలు జోరుగా సాగాయి. పేకాట, గుండాటకు కరెన్సీ వెదజల్లారు. జల్సాలతో జనం రెచ్చిపోయారు. కుర్రోళ్ల నుంచి వృద్ధులు వరకూ మూడ్రోజులు చిర్రెత్తిపోయారు. మేం తక్కువా అంటూ మహిళలు పోటీలో మెరిశారు. సంక్రాంతి రోజున ఒక బరిలో కోటి రూపాయల పందెం కొనసాగినట్లు తెలుస్తుంది. బరుల వద్ద మద్యం ఏరులై పారింది. పాలకోడేరు, తణుకులలో యథేచ్ఛగా కోడి పందేలు, జూదం నిర్వహించారు. నరసాపురం అన్ని బరుల్లో రాత్రి 12గంటల వరకు కోడి పందేలు, గుండాటలు నిర్వహించారు. ఈసారి చాల బరుల్లో కోడి పందాల కంటే గుండాటే కళకళలాడింది. నిర్వాహకులు ఆటల పేరు చెప్పి లక్షల రూపాయలు దోచుకున్నారు. నరసాపురం , మొగల్తూరు మండలాల్లో ఈఏడాది 20కిపైగా బరులు వేశారు. భీమవరం పట్టణం త్రీటౌన్‌లో రెండు చోట్ల కోడిపందేలు బరులు వెలిశాయి. మూడు రోజులుగా జోరుగా కోడిపందేలు కొనసాగాయి. కోడిపందేల ముసుగులో గుండాట, కోతాట జోరుగా సాగాయి. బస్ డిపో వెనుక ఇండస్ట్రియల్ ఏరియాలోనూ, విస్సాకోడేరు వంతెన సమీపంలో వేంద్ర రహదారి ప్రక్కన ఖాళీ సైట్‌లలో బరులు ఏర్పాటు చేశారు. మహిళలు సైతం పందేలు తిలకించడానికి ఎగబడ్డారు. యలమంచిలిలో పందేల జోరుకు రోడ్లపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది. మొగల్తూరులో ఆరు చోట్ల పందేల బరులు ఏర్పాటు చేశారు. పోడూరు మండలం జిన్నూరు గోపాలరాజు, ఆయన అనుచరులు కోడిపందేలకు పెట్టినపేరు. యలమంచిలి మండలం కలగంపూడిలో జరిగిన కోడిపందేల్లో జిన్నూరు గోపాలరాజు, ఆయన వర్గం పాగా వేసి జోరుగా కోడిపందేలు ఆడి పెద్దమొత్తంలో గెలిచినట్లు తెలిసింది. పెంటపాడు, తాడేపల్లిగూడెంలలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోడి పందేలు జరిగాయి. ఉండి మండలం మహదేవపట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పందేలు నిర్వహించారు.

కాళ్ళ: కాళ్ళ మండలంలోని కొన్ని గ్రామాల్లో రాత్రి పూట ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించారు. జాతరను తలపించేలా గ్రామాలన్నీ కోలాహలంగా మారాయి. కోడిపందాలకు వచ్చే వాళ్ళతో రోడ్లన్నీ స్తంభించిపోయాయి. మండలంలో ప్రధానంగా సీసలి, పెదఅమిరం గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ కోడి పందేల బరిలో పందెం రాయుళ్ళకు ఇబ్బంది కలగకుండా పందేలు వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. పందెం రాయుళ్ళను కట్టడి చేసేందుకు బౌన్సర్‌లను ఏర్పాటు చేశారు. పండుగ మూడు రోజులు కోడిపందేలను తిలకించేందుకు ప్రత్యేక పాస్‌లు ఏర్పాటు చేశారు. సీసలి కోడిపందేలు బరిలో నియోజకవర్గస్థాయి నాయకులతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు నాయకులు, వైజాగ్ ఎమ్మెల్యే జెకె రాజు, డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, గోకరాజు రామరాజు, మాజీ ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను, మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, వేటుకూరి వెంకట శివరామరాజు, గన్ని వీరాంజనేయులు కోడిపందేలు తిలకించారు.

అగస్త్యేశ్వర స్వామి ప్రభల ఉత్సవం



పెనుగొండ, జనవరి 16: వడలి గ్రామంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామి ప్రభల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రభల ఉత్సవం పచ్చని పొలాల మధ్యన వీరభద్ర స్వామి వారి రూపంలో ఉన్న పరమేశ్వరుని పూజించి మహా నైవేద్యంగా జొన్నలు నివేదన చేస్తారు. ఈ కార్యక్రమం అనంతరం భక్తుల దర్శనార్థం స్వామి వారిని గ్రామోత్సవం నిర్వహిస్తారు.

చంద్రబాబు కోసం టీడీపీ నాయకుల పూజలు



తులసీ మాతకు పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

భీమవరం అర్బన్, జనవరి 16: టీడీపీ అధినేత చంద్రబాబుపై నమోదు చేసిన స్కిల్ డెవలప్మెంట్ కేసును కోర్టు కొట్టేయాలని కోరుతూ భీమవరంలో మంగళవారం టీడీపీ నాయకులు పూజలు నిర్వహించారు. శ్రీనివాస్ థియేటర్‌లోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో కృష్ణబలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టీడీపీ బీసీ సాధికార కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు, నాగలక్ష్మి దంపతులచే తులసీ పూజ, స్వామి వారికి సహస్రనామ పూజలను నిర్వహించారు. ముందుగా మహిళలచే ఊరేగింపు నిర్వహించారు.

హరిదాసుకు సన్మానం

ఉండి, జనవరి 16 : సంక్రాంత్రి వచ్చిందంటే గ్రామాల్లో హరిలో రంగ హరి అంటూ చక్కని పాటలు పాడుతూ రాగాలు తీసే హరిదాసును ఎంపీటీసీ మున్నలూరి సువర్ణలక్ష్మీ శ్రీను దంపతులు పండుగరోజున పూలమాలతో సన్మానించారు.

కొప్పర్రుకు విచ్చేసిన ఎమ్మెల్యే గంటా



ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బండారు

నరసాపురం రూరల్, జనవరి 16: ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ మంగళవారం మండలంలోని కొప్పర్రు గ్రామానికి విచ్చేశారు. గ్రామానికి చెందిన మిత్రుడు పోలిశెట్టి జీజీ నివాసానికి విచ్చేసిన ఆయన్ను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. వీరిద్దరు కొద్ది సేపు జిల్లా రాజకీయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్క బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులు

భీమవరం, జనవరి 16 : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులు భీమవరంలో జరిగిన సంక్రాతి సంబరాల్లో పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఆయన సతీమణి, కుమార్తె సభ్యులు ఇక్కడ వేడుకల్లో పాల్గొన్నారు. మావుళ్ళమ్మ ఆలయంలో పూజలు చేయించుకున్నారు. కోడిపందేలు తిలకించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆహ్వానం మేరకు వారు వచ్చారు. ఆయన కుటుంబ సభ్యులతో సహా పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు కొండ్రెడ్డి మృతి



పెంటపాడు, జనవరి 16: రాచర్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొండ్రెడ్డి సత్యనారాయణ (58) మంగళవారం గుండె పోటుతో కన్నుమూశారు. గతంలో ఈయన రాచర్ల ఎంపీటీసీగా, నీటి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి తదితర నాయకులు సంతాపం తెలిపారు.





వీరవాసరంలో తాడు లాగుతున్న అంగన్‌వాడీలు (ఇన్‌సెట్‌లో) పెనుమంట్రలో సంతకాల సేకరణ

అంగన్‌వాడీల వినూత్న నిరసనలు

భీమవరం అర్బన్/వీరవాసరం/పెనుమంట్ర, జనవరి 16: భీమవరంలో అంగన్వాడీలు గడ్డి నోట్లో పెట్టుకుని నిరసన తెలిపారు. వీరవాసరంలో ఒక పక్క అంగన్‌వాడీలు మరో పక్క మంత్రుల మాస్కులు ధరించిన అంగన్‌వాడీలు నిలబడి తాడు లాగి వినూత్న నిరసన చేపట్టారు. పెనుమంట్రలో అంగన్‌వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు.

నేటి నుంచి పోలేరమ్మ జాతర



పెనుమంట్ర, జనవరి 16 : భట్లమగుటూరు గ్రామ దేవత పోలేరమ్మ 110వ జాతర ఈ నెల 17వ తేదీ నుంచి 24 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ఉపసర్పంచ్ లోలబట్టు పెదబాబు తెలిపారు. జాతరలో విచిత్రవేషధారణలు, గరగ నృత్యాలు, బుట్ట బొమ్మలు ఉంటాయని తెలిపారు. అమ్మవారికి నైవేద్యం అనంతరం గ్రామోత్సవం నిర్వహించి నిప్పుల గుండం తొక్కి భక్తులు మొక్కుబడులు చెల్లిస్తారని తెలిపారు 24వ తేదీన అమ్మవారిని పుట్టింటి నుంచి ఆలయానికి పంపిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



నాలుగు తరాల సంక్రాంతి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 16: సంక్రాంతి పండుగను నాలుగు తరాలు కలిసి ఘనంగా జరుపుకున్నారు. నవాబుపాలెంలో మద్దుకూరి సత్యనారాయణ సంక్రాంతి పండుగను తన ముని మనువలతో కలసి జరుపుకున్నారు. నవాబుపాలెం సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని ధనరాజు నివాసం వద్ద ఈ వేడుకను 150 మంది కలిసి చేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 16: తాడేపల్లిగూడెం ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ గ్రౌండ్‌లో గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ బ్రదర్స్ పర్యవేక్షణలో జరిగిన క్రికెట్ పోటీల్లో పీకేఎల్ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఏంజల్ జట్టుపై పీకేఎల్ జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేతలకు బహుమతులు ఇచ్చేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

గురువులు దేవుళ్ళతో సమానం



ఆధ్యాపకుల సన్మాన కార్యక్రమంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

నరసాపురం, జనవరి 16: తల్లిదండ్రులు, మాతృదేశం, విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులుదేవుళ్ళతో సమానమని విశాఖ గ్రే హౌండ్ ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. మంగళవారం టేలర్‌హైస్కూల్‌లో చెరుకూరి లక్ష్మణరావు దంపతుల మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో టేలర్‌స్కూల్ పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయుల్ని ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ ఉన్నత స్థితిలో మనం ఉన్నామంటే....దానికి చదువులు నేర్పిన గురువులే కారణమన్నారు.ట్రస్టు నిర్వాహకులు చెరుకూరి రంగనాథ్ మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ట్రస్టు తరుపున ప్రోత్సాహాలందిస్తామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పొతుల జగన్, రిటైర్డ్ ఉపాధ్యాయులు కడిమిళ్ళ వరప్రసాద్, గంట సుబ్బారావు పాల్గొన్నారు.

కలిగినీడి కుటుంబీకుల ఆత్మీయ సమ్మేళనం



నరసాపురం టౌన్, జనవరి 16: ఇంటిపేరు కలిగిన కుటుంబీకుల వివరాల సేకరించి వారందర్ని ఒక చోటకు చేర్చి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసంఘటన నరసాపురం పట్టణంలో సోమవారం జరిగింది. పట్టణానికి చెందిన కలిగినీడి వర్గిత దేశ, విదేశాల్లో ఉన్న తమ ఇంటిపేరు కలిగిన కుటుంబీకుల్ని ఏకం చేయాలని నిర్ణయించింది. తండ్రి హైకోర్టు న్యాయవాది చిదంబరం సాయంతో ఒక్కొక్కరి వివరాలు సేకరించి వారి ద్వారా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబాయి, ఆమెరికా, ఆస్ట్రేలియ, కెనడా, గల్ఫ్ దేశాల్లో ఉంటున్న వారి వివరాలను సేకరించారు. వీరందర్ని ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించారు. సుమారు 200 మంది కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట, పాటలతో ఎంజాయ్ చేశారు. వారి పూర్వీకుల వివరాలు, ఎక్కడెక్కడ స్థిరపడింది, యోగక్షేమాలపై చర్చించుకున్నారు.





గొల్లలకోడేరు, దువ్వలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

పాలకోడేరు, జనవరి 16 : గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 2006-07 సంవత్సరానికి చెందిన 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆనాడు చదువుకున్న పాఠశాలలో కలుసుకొని జ్ఞాపకాలను పంచుకున్నారు. చదువుకొన్న పాఠశాలను, నడయాడిన వీధులను మరొక్కసారి చూడటం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పూర్వ విద్యార్థులు చెప్పుకొచ్చారు. ఆటపాటలతో సందడి చేశారు.

తణుకు: దువ్వ జడ్పీ హైస్కూల్ 1972-73 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు తణుకు చిట్టూరి హెరిటేజ్‌లో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకుని నాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చు కున్నారు. గురువు బొబ్బా రామారావును సత్కరించారు. భూపతిరాజు ఆంజనేయరాజు, నిమ్మగడ్డ రాజేంద్రప్రసాదు, అయినపర్తి రాజగోపాల్, బూరుగుపల్లి వెంకటేశ్వర్లు, చివుకుల వెంకటసుబ్బారావు, కొండే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేడుకగా వనువులమ్మ జాతర



జాతరలో భక్తులు

నరసాపురం టౌన్, జనవరి 16: పట్టణంలోని లూథరన్‌చర్చి రోడ్‌లో కొలువైన వనువులమ్మ జాతర వేడుకగా నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు తెలంగాణ, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జాతరలో ఏర్పాటు చేసిన వినోద వస్తువులు ఎక్కి చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎంజాయ్ చేశారు.

వైభవంగా పుంతల ముసలమ్మ జాతర

యలమంచిలి, జనవరి 16: యలమంచిలి గ్రామంలో పుంతల ముసలమ్మ జాతర సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వీధుల్లో బాణసంచా, తీన్‌మార్ డప్పులు, గరగనృత్యాలతో అమ్మవారి జాతర చేశారు. మంగళవారం ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రామలింగేశ్వర స్వామి గ్రామోత్సవం

పాలకొల్లు టౌన్, జనవరి 16: పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కనుమ పండుగ ను దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహంచారు. అనంతరం స్వామి,అమ్మవార్లను నందివాహనంపై ఊరేగించారు. అలాగే లక్ష్మీజనార్దన స్వామి వార్లను గరుడ వాహనంపైనా, బ్రహ్మదేవుడను శాలివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట భజనలు, నృత్యప్రదర్శనలతో గ్రామోత్సవం నిర్వహించారు.

చిలుకూరులో పైడమ్మ జాతర



అమ్మవారి సన్నిధిలో దర్శకుడు వన్నెంరెడ్డి దంపతులు

ఉండి, జనవరి 16 : చిలుకూరులోని శ్రీపైడమ్మ జాతర ప్రారంభించారు. సినీ డైరెక్టరు రాజా వన్నెంరెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వన్నెంరెడ్డి కుటుంబీకులు ఆడపడుచుగా కొలిచే శ్రీపైడమ్మ జాతరను రెండేళ్లకొకసారి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో గరగ నృత్యాలు, గుర్రం నృత్యం, బుట్టబొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం సాయంత్రం వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కృష్ణాయపాలెంలో ముళ్లమ్మ జాతర



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 16: కృష్ణాయపాలెంలో ముళ్లమ్మ జాతర ఘనంగా జరుగుతోంది. అమ్మవారి ఊరేగింపు మేళ తాళాలు, కాంతార నృత్య ప్రదర్శన, బుట్టబొమ్మల మధ్య సాగింది. సర్పంచ్ బేతపూడి సుబ్బ లక్ష్మి, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, శ్రేణులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు వెలగలమ్మ జాతర

పోడూరు, జనవరి 16: పోడూరులోని శ్రీవెలగలమ్మ అమ్మవారి జాతరను బుధవారం నిర్వహించనున్నారు. జాతరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. అమ్మవారి ఆలయ వీధిలో పెద్దఎత్తున విద్యుత్‌దీపాలంకరణ చేశారు.

ఘనంగా బరికలమ్మ జాతర

పాలకోడేరు, జనవరి 16 : గొల్లలకోడేరు గ్రామ దేవతైన బరికలమ్మ అమ్మవారి జాతరను గ్రామస్తులు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గరగనృత్యాలు, బుట్టబొమ్మలు, తీన్‌మార్ వాయిద్యాలు, కేరళ డప్పులతో ఘనంగా జాతర నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వీరపేరంటాలమ్మకు పూజలు



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే కాంతారావును సన్మానిస్తున్న దృశ్యం

ఉండి, జనవరి 16 : తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి తనను చాలా కృంగదీసిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు అన్నారు. సోమవారం వెలివర్రులో శ్రీవీరపేరంటాలమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు దండు వెంకటసుబ్బరాజు, ఆలయ కమిటి మాజీ ఛైర్మన్ కళ్లేపల్లి సతీష్‌రాజు సన్మానం చేశారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ మూడవ సారి తాము గెలుపొంది హ్యాట్రిక్ సాధిస్తామని అనుకున్నామని అయితే ప్రజలు కాంగ్రెస్ వారు ఇచ్చిన హామీలను నమ్మి ఆపార్టీని గెలుపొందించారంటూ అన్నారు.

చిట్టవరంలో ముగ్గుల పోటీలు

నరసాపురం రూరల్, జనవరి 16: చిట్టవరంలో మంగళవారం అంజనా పుత్ర చిరంజీవి, పవన్ యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొని వివిధ రకాల ముగ్గులు చేశారు. గెలుపొందిన విజేతలకు టీడీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి బహుమతులందిచారు. న్యాయనిర్ణేతలుగా వనితక్లబ్ కార్యదర్శి స్వర్ణలత, భరణి, తరుణ, వెంకటరమణ వ్యవహరించారు.

అత్తిలి: సంక్రాంతికి రంగవల్లులే శోభనిస్తాయని అత్తిలి బులియన్స్ క్లబ్ అధ్యక్షుడు సింగులూరి చంద్రశేఖర్ అన్నారు. అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి సీతాల వెంకట నారాయణ, జోనల్ చైర్‌పర్సన్ యాతం రాంబాబు, మాజీ అధ్యక్షులు దాసం బాబ్జీ, దండమూరి వెంకటేశ్వరరావు, వడ్డి కొండబాబు, పంజా ప్రసాద్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. విజేతలకు రావూరి వెంకట సత్యనారాయణ, దాసం ప్రసాద్ బహుమతులు సమకూర్చారు.

విజేతలకు బహుమతులు అందజేత

పెంటపాడు, జనవరి 16: మండలంలోని ఉమామహేశ్వరంలో సంక్రాంతి సంబరాలను గ్రామ పెద్ద రాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు పోటీలను నిర్వహించి విజేతలకు తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు ఎస్ఐ లు రమేష్, హరికృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం పోలీసులకు యూనిఫాం అందజేసారు. టీడీపీ నాయకులు కొండ్రెడ్డి హైమవతి, మద్దుకూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు